క్లుప్తంగా

ప్రమాదకరంగా ఊటగెడ్డ కూడలి మలుపు



ఊటగెడ్డ కూడలిలో ఏర్పడిన గోతులు

పరవాడ: ఎన్టీపీసీ–పరవాడ రహదారిలోని ఊటగెడ్డ కూడలి మలుపు ప్రయాణికులను నిత్యం భయపెడుతోంది. విశాఖ పోర్టు నుంచి హిందూజా పరిశ్రమకు బొగ్గును, ఎన్టీపీసీ నుంచి ఫ్లైయాష్‌ను తరలించే వందలాది భారీ వాహనాల రాకపోకల కారణంగా ఈ మలుపులో భారీ గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు మలుపులో ఏర్పడిన ఈ గోతులను ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ఉద్యోగులు, కార్మికులు ఈ గోతులను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఊటగెడ్డ మలుపులో ఏర్పడిన ఈ గోతులను తక్షణమే పూడ్చి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

సర్పంచ్‌కు అదీప్‌రాజ్ పరామర్శ



పార్టీ నేతలతో కలిసి సర్పంచ్ పిల్లల అప్పలనాయుడ్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

సబ్బవరం : మండలంలోని రాయపుర అగ్రహారం సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు ఇటీవల అక్రమ కేసులో అరెస్ట్ అయి విడుదలైన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం ఆయనను పరామర్శించారు. పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అప్పలనాయుడుతో పాటు విడుదలైన పార్టీ కార్యకర్తల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అదీప్‌రాజ్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, పార్టీ అధికార ప్రతినిధి కోటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్, బీసీ సెల్ అధ్యక్షులు రాపేటి రాము, పార్టీ నాయకులు గవర రాజు, నాయుడు, లీగల్ సెల్ అధ్యక్షుడు యర్రా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాస్, బోడ్డేటి మహాలక్ష్మినాయుడు, ఎస్‌పీ రాజు, ఐడీ బాబు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయండి



కలపాక రహదారిలో ప్రమాదకరమైన మలుపు

పరవాడ: వెన్నలపాలెం–కలపాక రహదారిలోని ప్రమాదకరమైన మలుపు నిత్యం ప్రయాణికులను భయపెడుతోంది. ఈ రహదారి మీదుగా ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులతో పాటు పిట్టవానిపాలెం, దేవాడ, చినపాలెం, పెదపాలెం, కలపాక, గొల్లపేట గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కలపాక బీసీ కాలనీ దాటిన తర్వాత వచ్చే ఈ మలుపులో గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. మలుపునకు ఇరువైపులా రోడ్డును ఆనుకుని దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు, చెట్ల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదకరమైన మలుపు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేదా స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల ప్రయాణికులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులను తొలగించడానికి, మలుపు వద్ద పెరిగిన ముళ్ల పొదలను తొలగించాలని, అలాగే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖ–అనకాపల్లి జిల్లాల్లోని 11 డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉభయ జిల్లాల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 బాలురు, 7 బాలికల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల బాలబాలికలు ఆయా పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్‌ను జత చేసి ఈ నెల 24వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 12 గంటల లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. 25న బుధవారం ఉదయం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ 0891–2799641లో సంప్రదించాలని సమన్వయకర్త రామకృష్ణ కోరారు.

ప్రమాదాల హైవే..



వాహనాలతో రద్దీగా లంకెలపాలెం నాలుగు రోడ్ల కూడలి

- అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- అచ్యుతాపురం పరిసరాల్లో 305 భారీ పరిశ్రమలు
- ముడిసరుకు, ఫ్లైయాష్, బొగ్గు రవాణా చేసే భారీ వాహనాలతో ముప్పు



బొగ్గు లారీ సృష్టించిన బీభత్సంలో ధ్వంసమైన విద్యుత్ స్తంభాలు, రెయిలింగ్(ఫైల్)



లంకెలపాలెం నాలుగు రోడ్ల కూడలి

పరవాడ: అనకాపల్లి–విశాఖపట్నం జాతీయ రహదారిలోని లంకెలపాలెం నాలుగు రోడ్ల కూడలి ప్రయాణికులకు ఓ పీడకలగా మారింది. ఒకప్పుడు ప్రశాంతంగా ఉన్న ఈ జంక్షన్, ఇప్పుడు పరిశ్రమల విస్తరణతో నిత్యం రద్దీగా, ప్రమాదకరంగా మారి ప్రజలను భయపెడుతోంది. పరవాడ ఫార్మాసిటీ, అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి, ఎన్టీపీసీ, హిందూజా వంటి భారీ పరిశ్రమలతో పాటు దాదాపు 305 చిన్న తరహా పరిశ్రమల రాకతో లంకెలపాలెం జంక్షన్ రద్దీకి ప్రధాన కారణమైంది. ఈ పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు, ఫ్లైయాష్, బొగ్గు రవాణా చేసే భారీ వాహనాలతో పాటు, పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు ఈ కూడలి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 8:30 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల వరకు ఈ జంక్షన్ అత్యంత రద్దీగా ఉంటుంది.

ప్రమాదాల పరంపర

భారీ వాహనాలు, ముఖ్యంగా బొగ్గు, బూడిద లారీలు సృష్టిస్తున్న భయానక వాతావరణం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. అతివేగం, ఓవర్‌లోడ్‌లే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. అగనంపూడి వంతెన వద్ద నుంచి రోడ్డు డౌన్‌గా ఉండటంతో, వేగంగా వస్తున్న భారీ వాహనాలను నియంత్రించడం డ్రైవర్లకు కష్టమవుతోంది.

➡ ఈ నెల 3న తెల్లవారుజామున విశాఖ పోర్టు నుంచి అచ్యుతాపురం ఎస్ఈజెడ్ వైపు వస్తున్న ఒక బొగ్గు లారీ అతివేగంగా వచ్చి కూడలిలో కారు, ఆటోలను ఢీకొట్టి, విద్యుత్ స్తంభం, రెయిలింగ్‌లను ధ్వంసం చేసింది. వేకువజామున కావడంతో ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

➡ గతేడాది మార్చి 29న మధ్యాహ్నం బ్రేకులు ఫెయిల్ అయిన ఒక బొగ్గు లారీ బీభత్సం సృష్టించడంతో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. ట్రాక్టర్, కారు, రెండు ఆటోలు, రెండు ద్విచక్ర వాహనాలు, విద్యుత్ స్తంభాలు, రెయిలింగ్‌లు ధ్వంసమయ్యాయి.



అధిక లోడ్లతో రాకపోకలు సాగిస్తున్న బొగ్గు లారీలు

పటిష్ట చర్యలు తీసుకోవాలి

కూడలిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీస్ పికెట్, సిగ్నల్ వ్యవస్థ, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినప్పటికీ, ప్రమాదాలు ఆగడం లేదు. నిత్యం జరుగుతున్న ఈ ప్రమాదాలతో లంకెలపాలెం జంక్షన్ మీదుగా ప్రయాణించాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ పెంచి, ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బొగ్గు లారీ సృష్టించిన బీభత్సంలో దెబ్బతిన్న ఆటో (ఫైల్)

రోడ్డెక్కాలంటేనే భయమేస్తోంది



దశాబ్ద కాలంగా ఆటో నడుపుతున్నాను. లంకెలపాలెం కూడలిలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య నెలకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రాఫిక్ పెరిగిపోయింది. ఆటో నడపడం అత్యంత కష్టంగా మారింది. ముఖ్యంగా, కూడలి మీదుగా అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే బొగ్గు, బూడిద లారీలను తప్పించుకోవడం గగనంగా మారింది. బొగ్గు, బూడిద లారీల వేగాన్ని నియంత్రించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించి తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలి.

– నెల్లి ముసిలినాయుడు, ఆటో డ్రైవర్, లంకెలపాలెం


బొగ్గు లారీలతో భయం భయం



అనకాపల్లి–విశాఖపట్నం జాతీయ రహదారిలోని లంకెలపాలెం కూడలిలో రోడ్డు దాటాలంటేనే ప్రజలు భయంతో వణికిపోతున్నారు. నిత్యం ఈ కూడలి మీదుగా ప్రయాణించే బొగ్గు, బూడిద లారీలు సృష్టిస్తున్న భీభత్సంతో తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతకాల్సి వస్తుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో భయం భయంగా రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ కూడలిలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తక్షణమే పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– రౌతు మూర్తి, లంకెలపాలెం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



లంకెలపాలెం కూడలిలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించడానికి, ప్రమాదాలను తగ్గించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వాహనచోదకులపై కఠిన చర్యలు ఉంటున్నాం. బూడిద లారీల వేగాన్ని నియంత్రణలో భాగం గా డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. కూడలి మీదుగా అతి వేగంగా నడిచే వాహనాలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నిర్వహించిన అనంతరం తోమాల సేవ జరిపారు. అనంతరం సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తులాభారం నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించడంతో పాటు, ప్రసాద వితరణ కూడా చేపట్టారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిత్యకల్యాణం ఉదయం 9:30 గంటల నుంచి వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ అత్యంత విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించి, విశేషంగా హారతి సమర్పించారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

సాంకేతిక విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు



కళాశాలలోని సౌకర్యాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్



వెబ్ ఆప్షన్‌ల గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: సాంకేతిక విద్యతోనే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, వసతులు, ప్లేస్‌మెంట్ అవకాశాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది చేరబోయే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు వి.ఆర్.ఎల్. మూర్తి, కె.సత్తిబాబు, ఎం.నాగమణి, బి.రామసుధీర, కె.శ్రీనివాసరావు, మరియు పాలిసెట్ ఇంచార్జి బి.శేషసాయి పాల్గొన్నారు.

పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ర్యాంకు సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. తొలిరోజు 1వ ర్యాంక్ నుంచి 15,000 ర్యాంక్ వరకు గల అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు అవకాశం కల్పించారు. మొత్తం 106 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. వారికి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాలిసెట్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ గురించి వివరించారు.

ప్రశాంతంగా పాలిసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది



గైస్‌లో విద్యార్థికి రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట రమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. యోగాంధ్ర కార్యక్రమం ఉన్నప్పటికీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ , కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నానికి విద్యార్థుల హాజరు పూర్తి స్థాయిలో ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 7,501 నుంచి 15,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 296 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. వీరిలో 234 మంది బీసీ విద్యార్థులు, 44 మంది ఓసీలు, 17 మంది ఎస్సీలు, ఒకరు ఎస్టీ విద్యార్థి ఉన్నారు. వీరందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ పర్యవేక్షణలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.ఎం. భాషా, లెక్చరర్ నాగరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం 23,501 నుంచి 32,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ జరిగింది. ఇక్కడ 1 నుంచి 7,500 ర్యాంక్ వరకు గల విద్యార్థులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ అందించారు. ఆదివారం 15,001 నుంచి 23,500 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

పరిసరాల పరిశుభ్రతతో పర్యావరణ పరిరక్షణ



సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మహారాణిపేట: జిల్లా పరిషత్‌లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర 'మూడో శనివారం కార్యక్రమం జరిగింది. సీఈవో పి.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛత ఆవశ్యకత, పచ్చదనం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్, పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయాల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏపీపీఆర్ఎంఈఏ అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఏపీఎన్‌జీవో జాయింట్ సెక్రటరీ ఎ.మదన్‌మోహన్, పరిపాలనాధికారులు మంజులవాణి, ఎం.నరసింహమూర్తి, పి.వి.వి.ఎస్. మూర్తి, రాజేశ్వరి, జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, పంచాయితీరాజ్ అధికారులు, సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పెందుర్తి రైతుబజార్‌లో యోగాసనాలు వేస్తున్న ఈవో షర్మిల, రైతులు, వినియోగదారులు



గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న పాఠకులు



యోగాసనాల్లో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు



సబ్బవరం శాఖా గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, పాఠకులు



భాష్యం పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



దేవస్థానం పరిపాలన కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, వేద విద్యార్థులు

పెందుర్తి: అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం పెందుర్తి ప్రాంతంలో ఘనంగా జరిగింది. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగ గురువులు ఈ సందర్భంగా తెలియజేశారు. పెందుర్తి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి. చంద్రకళ ఆధ్వర్యంలో పాఠకులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు యోగాసనాలు వేశారు. యోగ గురువు లక్ష్మీతేజ మాట్లాడుతూ, యోగాసనాల ద్వారా రక్తపోటు, చక్కెర వ్యాధి, థైరాయిడ్ వంటి అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. యోగ వలన మనిషి శరీరంలోని 72 వేల నాడులు చక్కగా పనిచేస్తాయని, జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పి. భూలోకరావు, పి. గణేష్, ఎ. రామకృష్ణ, గణేష్, స్పిర్చువల్ లైఫ్ సొసైటీ, సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెందుర్తి రైతుల బజార్‌లో ఈవో పద్మావతి షర్మిల ఆధ్వర్యంలో రైతులు, వినియోగదారులు యోగాసనాలు వేశారు. యోగా వలన కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా ఈవో వివరించారు. స్థానిక భాష్యం పాఠశాలలో కూడా యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగ గురువుల సూచనల మేరకు సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ జీవీ దీపిక, హెచ్.ఎం. టెన్సి, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానంలో...

సింహాచలం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని సింహాచలం దేవస్థానం పరిపాలన భవనంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు దేవస్థానం ఉద్యోగులు, వేద పాఠశాల విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా గురువు శ్రీదేవివర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. దేవస్థానం ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దినచర్యలో యోగా భాగం కావాలి

సబ్బవరం : యోగా ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం కావాలని, విద్యార్థులు తమ దినచర్యను యోగాసనాలతోనే ప్రారంభించాలని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి పిలుపునిచ్చారు. యోగా వార్షికోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించి, యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గ్రంథాలయ అధికారి వి. శిరీష నిర్వహించారు.

జూలో జిరాఫీలపై విద్యార్థులకు అవగాహన



జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్ద జిరాఫీ మాస్క్‌లు వేసుకున్న చిన్నారులతో జూ అధికారులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో శనివారం అధికారులు ప్రపంచ జిరాఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు గ్రూప్‌లుగా పాల్గొని ప్రతిభ చూపారు. జిరాఫీపై కథలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం యానిమల్ కీపర్లతో మాట్లాడించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అధికారులు జిరాఫీ మాస్క్‌లు పంపిణీ చేశారు. వారిని జిరాఫీ ఎన్‌క్లోజర్ వద్దకు తీసుకెళ్లి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు వన్యప్రాణుల విద్య అవసరమన్నారు. వాటి గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జూలో ఉన్న జిరాఫీలు రెట్టిక్యులేటెడ్ ఉపజాతికి చెందినవన్నారు. వాటి గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు.